# 9

# పద్ధతైన పెళ్ళి

"నీకు భవాని ఫోన్ చేసిందిటే?" అంటూ పొద్దున్నే లత ఫోన్ చేసింది.

"నాకేం చెయ్యలేదే! ఏమిటి విశేషం?" అన్నాను. భవాని నా కజిన్.

"పెద్ద విశేషమే. దాని కొడుకు పెళ్ళి సెటిల్ అయింది" అంది లత.

నాకు సంతోషం అనిపించింది. "పోన్లే. ఏడాదిగా బోలెడు సంబంధాలు చూసింది. దేనికీ ఒప్పుకోలేదు వాడు" అన్నాను.

"ఇప్పుడు కూడా దీని మాటకి ఒప్పుకోలేదులే. వాడే ఒప్పించాడు! లవ్ మేరేజి. అమెరికా పిల్ల" అంటూ వివరాలన్నీ చెప్పింది.

విదేశీపిల్ల స్వదేశం అబ్బాయిని పెళ్ళిచేసుకోడం వింత కాదు, కొత్తా కాదు. చాలామంది చేసుకుంటున్నారు.

మధ్యాహ్నం భవాని ఫోన్ చేసింది. విషయం చెప్పగానే "లత చెప్పింది" అన్నా.

"ఒక్కొక్కళ్ళకీ ఫోన్‌చేసి చెప్తున్నా. నీతో కాస్త తీరిగ్గా మాట్లాడాలని ఇపుడు ఫోన్ చేశా. ఎంత చెప్పినా విన్లేదు వాడు. ఏం చేస్తాం? వాడెలాగూ అక్కడే ఉండి పోతాడాయెనూ! ఇండియన్ కోడలొచ్చి నన్నుద్ధరిస్తుందా? అమెరికన్ పిల్ల ఉద్ధరించక పోతుందా?... సరే అన్నాం. వాళ్ళిక్కడికే వస్తారుట. ఆ పిల్లకి మన పద్ధతులంటే చాలా ఇష్టం. అంతా మన పద్ధతి ప్రకారమే. వాళ్ళకంతా కొత్త కదా! మీరంతా నిలబడాలి మరి. నువ్వూ, లతా, లలితా, సుందరీ, లక్ష్మి పిన్నీ..." తను చెప్తుండగానే నా గుండె దడదడలాడింది.

"నన్ను లిస్టులోంచి తీసెయ్యవే! నాకు ఆరోగ్యం అంతగా బావుండటం లేదు. కాస్త నడిస్తే కాలు వాచిపోతుంది. నడుము నొప్పి ఉండనే ఉంది" అన్నాను.

"నాకు తెలియదుటే నీ హెల్త్ కండిషనూ? అందుకే నీకు తేలిక పనే అప్పచెప్తున్నా. పెళ్ళివారి దగ్గరుండి వాళ్ళకి అన్నీ అర్థం అయ్యేలా చెప్పు... చాలు" అంది.

నాకు దుఃఖం తన్నుకొచ్చింది.

అది పెళ్ళి విషయం చెప్తుంటే, నేనేడిస్తే భావ్యంగా ఉండదు కదా! అందుకే "ఆ పని వద్దులే భవానీ! భోజనాల దగ్గర నిలబడి ఆర్గనైజ్ చేస్తా" అన్నాను.

"ఆ పన్లకు బోలెడుమంది ఉన్నారు. నువ్వు ఇంగ్లీషు బాగా మాట్లాడతావు. పద్ధతులన్నీ తెలుసు నీకు. వాళ్ళకి అరటిపండు ఒలిచి చేతుల్లో పెట్టినట్లు చెప్తావు. అందుకే నీకు ఆ పని అప్పగించి, నేను నిశ్చింతగా ఉండవచ్చు" అంది ఖచ్చితంగా.

ఇక తప్పించుకోలేను. గతంలో కూడా ఇలాగే తెల్లపెళ్ళివారి మంచీ మర్యాద చూసే బరువు నెత్తిన వేసుకుని చాలా అవస్థలు పడ్డాను.

ఒకసారి ఒక పెళ్ళివారిని షాపింగుకి తీసికెళ్లా. పెళ్ళికూతురి తల్లి లోపలి లంగా, జాకెట్‌తో ట్రైల్ రూంలోంచి బయటికొచ్చింది! "ఇది చాలు నాకు, హాయిగా ఉంది. ఇంకా శారీ కూడా ఎందుకూ?" అని అడిగింది అమాయకంగా.

"ఇలాంటి డ్రెస్ కావాలంటే లాంగ్ స్కర్ట్ బ్లౌజ్ కొంటాను గానీ ఇలా తిరక్కూడదు" అని చెప్పా. ఇలాంటి అనుభవాలు చాలానే ఎదురయ్యాయి నాకు.

భవాని కొడుకు పెళ్ళికి ముహూర్తాలు పెట్టారు. సామాన్యంగా ఇటువంటి పెళ్ళిళ్ళకి విదేశీ పెళ్ళివారేమీ ఖర్చుపెట్టరు. అలా పెట్టాలనీ తెలియదు వాళ్ళకి. ఇక్కడా అంతే. ఉభయ ఖర్చులూ భవానివే! కొడుకు అయిదువేల డాలర్లు ఇచ్చాడుట. మిగిలినదంతా తనే భరిస్తోంది. ఏ లోటూ లేకుండా సంప్రదాయంగా వివాహం చెయ్యాలని ఆరాటం. భారీగానే ఖర్చుపెడుతోంది. ఊరిబయట మంచి గార్డెను బుక్ చేశారు.

ఆడపెళ్ళివారికి హోటల్లో ఏసీ రూములు. పెళ్ళికి నాల్రోజుల ముందే వచ్చారు తెల్లపెళ్ళివారు. పెళ్ళికూతురు పేట్రీషియా, వాళ్ళ అమ్మా, నాన్నా, పెద్దక్కా, ఆవిడ బాయ్‌ఫ్రెండూ, చిన్నక్కా, భర్తా, అన్నా, అతని గర్ల్‌ఫ్రెండూ, మరో ఇద్దరు ఫ్రెండ్స్!

వచ్చిన మర్నాడు వాళ్ళందర్నీ షాపింగ్‌కి తీసికెళ్ళి, ఆడవాళ్ళకి చీరెలు మగవాళ్ళకి కుర్తా పైజామాలూ కొనిపించాను. మరి సంప్రదాయంగా జరిగే పెళ్ళికి మన దుస్తులే ధరించాలిగా!

పురోహితుడు భాస్కరశాస్త్రి ఇటువంటి పెళ్ళిళ్ళు చేయించడంలో దిట్ట. డబ్బు ఎక్కువే పుచ్చుకుంటాడుగానీ, ఎక్కడా తేడా రానివ్వడు. సంస్కృతంలో మంత్రాలు చదువుతూ "నాయనా! నీ రైట్ హేండుతో అమ్మాయి లెఫ్ట్ హేండ్ పట్టుకో. అమ్మాయ్! ఈ స్పూన్‌తో త్రీ టైమ్స్ అబ్బాయి చేతిలో వాటర్ వెయ్యమ్మా. ఇద్దరూ దేవుడిని బాగా ప్రే చేసుకోండి" అని ఇంగ్లీషులో వ్యాఖ్యానం చెప్తూ, పెళ్ళి యథావిధిగా చేయించేస్తాడు. పెళ్ళిళ్ళ సీజన్‌లో ఆయన దొరకడం మా భవాని అదృష్టం.

ఇకపోతే, బ్యూటీషియన్ నవ్య. బోడిగుండుకి కూడా పూలజడ వెయ్యగల సమర్థురాలు! ఇద్దరు అసిస్టెంట్లతో తను ఆ రెండ్రోజులూ ఇక్కడే ఉండేట్లు మాట్లాడేశారు.

ఆవిడ వచ్చి ఈ తెల్లవాళ్ళందరికీ చీరెలు కట్టింది. "పెళ్ళికూతురికి ముహూర్తానికి పూలజడ వేస్తా" అని అప్పటికి బాబ్డ్ హెయిర్‌ని పోనీ వేసి పూలు పెట్టింది.

వాళ్ళందరికీ బ్రేక్‌ఫాస్ట్ పెట్టించాను. ఇడ్లీ, వడ బాగానే తిన్నారు.

పొద్దున స్నాతకం మొదలైంది. ప్రతి ఘట్టమూ వాళ్ళకి టీకా తాత్పర్యంతో చెప్పాలి. నాకు నీరసం వస్తోంది. వాళ్ళకి అర్థం కాదు! అర్థం అయ్యాక లక్ష సందేహాలు! ప్రతిదానికీ 'బట్ వై?' అని అడుగుతారు. ఏం చెప్పాలి? 'ఇది మా పద్ధతి' అనాలి అంతే.

కాశీయాత్ర గురించి చెప్పాను. "ఓ... ఇట్స్ ఫన్నీ" అని సరదాపడ్డారు. స్నాతకం కూడా చూడాలన్న సరదాతో పెళ్ళికూతురు ఆ పక్కనే కుర్చీ వేసుకుని కూర్చుంది. కాశీయాత్రకి పెళ్ళికొడుకుతో బాటు తనూ గెంతుకుంటూ బయటికి వచ్చింది!

భాస్కరశాస్త్రి పెళ్ళికూతురి అన్నచేత పెళ్ళికొడుకు కాళ్ళు కడిగించి "డోంట్ గో టూ కేషీ! మేరీ మై సిస్టర్" అనిపించాడు. "ఓ.కే" అనిపించాడు పెళ్ళికొడుకు చేత!

ఇదంతా నేను ఎక్స్‌ప్లెయిన్ చేస్తుంటే ఆనందించిన పెళ్ళికూతురు... గొడుగులో దూరి పెళ్ళికొడుకుని ముద్దు పెట్టేసుకుంది!

లోపలికి పోయాం. స్నాతకం అయింది.

సాయంత్రం రిసెప్షన్. "ప్రమోద్ వెడ్స్ పేట్రీషియా" అని ద్వారం పక్కన బోర్డు పెట్టారు. పిల్లకి పట్టుచీరె కట్టి, ముడిచుట్టింది బ్యూటీషియన్. ప్రమోద్ సూట్ వేసుకున్నాడు. ఇద్దర్నీ స్టేజీమీద నిలబెట్టి దండలు మార్పించారు.

దండవేసి, ప్రమోద్‌ని ముద్దుపెట్టుకుంది పేట్రీషియా!

వాడు వారించాడు. "ఇదింకా పెళ్ళి కాదు డార్లింగ్... అసలు పెళ్ళి... తర్వాత" అని చెప్పాడు.

"ఓ..." అని ఆశ్చర్యపోయింది.

అతిథుల రాక మొదలయింది. వాడు పరిచయం చెయ్యడం, ఆ పిల్ల 'ఓ..' అని ఆనందపడిపోయి వాళ్ళని కావలించుకుని ముద్దెట్టుకోడం!

"వద్దమ్మా, నమస్కారం చెయ్యి చాలు" అని చెప్పాను.

"ఐ సీ" అని ఆ తర్వాత అందరికి చేతులు జోడించి 'నెమిస్తే' అని నమస్కారాలే చేసింది పాపం!

రిసెప్షనూ అయిపోయింది.

వెంటనే వరపూజ. పానకం బిందెలు. మళ్ళీ వాళ్ళకు అర్థమయ్యేలా చెప్పడం! అటుపక్క ఆడవాళ్ళకు, ఆ బాయ్‌కట్ తలలకే క్లిప్‌తో పూలు తగిలించాం!

"దీని బొంద! ఈ భవానికి బుద్ధిలేదు. 'ఏదో సింపుల్‌గా చెయ్యవే' అంటే 'నాకు ఒక్కడే కొడుకు, నా సరదా తీరొద్దా' అని అఘోరించింది. మండినట్లే ఉంది దీని సరదా! ఇదే తుమ్మి ఇదే చిరంజీవ అనుకున్నట్లు... అన్ని వస్తువులూ తనే కొనుక్కుని ఈ అయోమయం తెల్ల వియ్యాలవారికి అన్నీ చెప్పుకుంటూ! ఈ పానకం బిందెలూ, ఆడపడుచు లాంఛనాలు ఎందుకూ? అన్నీ మతీ సుతీలేని పన్లు" అని ఇవన్నీ అందిస్తున్న లత, సుందరి విసుక్కున్నారు.

ఆ తర్వాత ముహూర్తం. తెల్లవారుజామున పీటలమీద కూర్చోవాలి.

భాస్కరశాస్త్రి నన్ను పిలిచి "అమ్మా! మరి అమ్మాయివైపు కన్యావర్ణనలూ ప్రవరా ఏం చేద్దాం?" అని అడిగాడు.

"నాకేం తెలుసు? మీకే అనుభవం ఉంది, మీరే చెప్పండి" అన్నా.

"పిల్ల పేరు తెలుసు. పేట్రీషియా. తండ్రి పేరూ, తాతముత్తాల పేర్లూ అడిగి తెలుసుకోండి. అబ్బాయి ప్రవర చదివి అమ్మాయికి చదవకుండా ఊరుకున్నా... అదీ ఎబ్బెట్టుగానే ఉంటుంది కదా?" అన్నాడు.

వెళ్ళి పిల్ల తల్లిని అడిగాను.

"ఎందుకూ?" అంది యథాప్రకారం!

"వాళ్ళ పేర్లు కూడా పెళ్ళిలో చెప్తారు" అన్నా.

"వీళ్ళ పెళ్ళికి వాళ్ళందరి పేర్లూ ఎందుకూ?" అని ఆశ్చర్యంగా అడిగింది.

"నీతో నేను వాగి చావలేను" అని తెలుగులో ఏడ్చుకుని "అది మా పద్ధతి" అన్నా.

పిల్ల తండ్రి పేరు తెలుసు. ఆయన తండ్రి దగ్గరే తంటా వచ్చింది. ఈయనకి బుద్ధి తెలిసేసరికే, తల్లి... మొదటి మొగుడికి విడాకులిచ్చి మరో అతడ్ని పెళ్ళి చేసుకుందిట. "ఇద్దర్లో ఎవరి పేరు చెప్పాలి?" అన్నాడు. "కన్నతండ్రి పేరే చెప్పమన్నాం చెప్పాడు. ఇక ఆయన తండ్రి పేరు ఈయనకీ తెలీదుట! ఈయన తల్లి అమెరికాలో ఉంది. ఫోన్ చేసి కనుక్కోమన్నాం. పాపం... కనుక్కున్నాడు.

ఆ పేర్లన్నీ కాయితంమీద రాసి, భాస్కరశాస్త్రికి ఇచ్చాను. "మొత్తానికి సాధించారే" అని ఆనందపడ్డాడు.

వివాహం ప్రారంభం అయింది. పిల్లా, తండ్రీ పీటలమీద కూర్చున్నారు. తల్లికి కీళ్ళవాతం. కాళ్ళొంగవుట. చిన్న స్టూల్ వేసి కూర్చోబెట్టారు.

కార్యక్రమం జరుగుతోంది. "చతుస్సాగర పర్యంతం గో బ్రాహ్మణేభ్య శుభం భవతు... వాశిష్ఠ మైత్రావరుణ కౌండిన్య త్రయార్షేయ ప్రవరాన్విత కౌండిన్యస గోత్రోద్భవస్య గోపాలరావు శర్మణః నప్త్రే... మాధవరావు శర్మణః పౌత్రాయ... శ్రీధరరావు శర్మణః పుత్రాయ... ప్రమోద్ నామధేయాయ స్సాక్షాత్ నారాయణ స్వరూపాయ వరాయ" అని వరుడి ప్రవర చదివారు.

"ఓం శుభ గోత్రోద్భవస్య బ్లేక్ పియాన్‌స్కీ గారి నప్త్రీం జెఫ్ ఓ బ్రెయిన్‌గారి పౌత్రీం. మైకెల్ హాఫ్‌పెన్నీగారి పుత్రీం. పేట్రీషియా నామ్నీం... సాక్షాత్ లక్ష్మీ స్వరూపిణీ కన్యాం" అని కాయితం చూస్తూ ప్రవర చదివాడు భాస్కరశాస్త్రి.

"లాగించేశాడు మొత్తానికి" అనుకున్నాం.

ముహూర్తం దగ్గరపడింది. మూడు ముప్పై ఏడుకి. అందరూ వాచీలు చూసుకుంటున్నారు. ఒక పురోహితుడు సావధాన శ్లోకాలు చదువుతున్నాడు.

భాస్కరశాస్త్రి అప్పటిదాకా అన్నీ వివరంగా చెప్పినవాడు కాస్త తడబడ్డాడు. లేకపోతే ఇతను చెప్పింది మేళాల గొడవలో ఆ పిల్లకి అర్థం కాలేదో ఏమో! ముహూర్తం టైముకి ప్రమోద్ ఆ పిల్ల తలమీద బెల్లం, జీలకర్ర పెట్టేశాడు. పేట్రీషియా తన చేతుల్లోని బెల్లమూ జీలకర్రా తన తలమీదే పెట్టేసుకుని ఫెళ్ళున నవ్వేసింది.

అందరూ తెల్లబోయారు. భాస్కరశాస్త్రి తేరుకుని "నో నో... నాట్ ఆన్ యువర్ హెడ్. యూ హేవ్ టు పుట్ ఇట్ ఆన్ హిజ్ హెడ్" అని ఆ ముద్ద తీసి ఆ పిల్ల చేతికిచ్చి వాడి నెత్తిన పెట్టించాడు. తర్వాత మంగళసూత్రధారణ. రెండు తలంబ్రాల పళ్ళేలలోనూ రెండు పక్కలవారి సూత్రాలూ పెట్టి పూజ చేయించాడు.

భాస్కరశాస్త్రి చెప్పగానే, ఒక మంగళసూత్రం పట్టుకుని నిలబడ్డాడు ప్రమోద్. వెంటనే రెండో సూత్రం పుచ్చుకుని లేచి నిలబడింది పెళ్ళికూతురు.

గభాల్న ఆ పిల్ల చేతిలోంచి అది తీసుకుని "కూర్చో అమ్మా! రెండూ అతనే కడతాడు" అని ఇంగ్లీషులో చెప్పాడు శాస్త్రి.

"ఓ... దీసీజ్ అన్‌ఫెయిర్" అని మళ్ళీ ఫెళ్ళున నవ్వింది పేట్రీషియా! అన్యాయం అన్నా. తలొంచుకుని, రెండూ కట్టించుకుంది ఆనందంగా.

తలంబ్రాలు. మంత్రాలు చదివి నాలుగు దోసిళ్ళు పోయించి "ఇక మీ ఇష్టం" అని సైగచేశాడు భాస్కరశాస్త్రి. అది ఎలా అర్థం అయిందో... ఓ దోసెడు తలంబ్రాలు తీసి భాస్కరశాస్త్రి నెత్తిన పోసింది పెళ్ళికూతురు.

"అబ్బబ్బ. ఈ పెళ్ళికూతురు పేట్రీషియాకి అన్నింటికీ హడావిడీ కంగారూ! ఇంత అత్యుత్సాహం అయితే ఎట్లా వేగుతాడు ఈ ప్రమోద్?" అన్నాడు భాస్కరశాస్త్రి. విసుగ్గా తలంబ్రాలు దులుపుకొంటూ.

"పాపం ఆ పిల్లకేం తెలుస్తాయి మన పద్ధతులు? మనల్ని తెల్ల గౌనేసుకుని వాళ్ళ పద్ధతిలో పెళ్ళి చేసుకోమంటే... మనం మాత్రం అవస్థపడిపోమా భాస్కరశాస్త్రి గారూ! ఇంకా నయం, ఓపిగ్గా మనం చెప్పినవన్నీ చేస్తోంది" అని కోడల్ని వెనకేసు కొచ్చింది భవాని.

మిగిలిన కార్యక్రమం అంతా కూడా బాగానే జరిగిపోయింది. అప్పగింతల సమయంలో భవాని ఏడ్చింది.

"ఆవిడ ఎందుకలా ఏడుస్తోంది?" అడిగారు ఆడపెళ్ళివారు.

నాకూ కళ్ళు కూరుకుపోతున్నాయి. "ఇది మా పద్ధతి" అని అలవాటు ప్రకారం చెప్పబోయి, తెలివి తెచ్చుకున్నాను. "అసలు ఆచారం ప్రకారం ఆడపిల్ల తల్లి ఏడుస్తుంది. మరి ఇది ఎందుకేడుస్తోందో?" అనేశాను.

"ఓ... ఐసీ! మరైతే మేం ఏడవాలా?" అంది పిల్ల తల్లి.

కోరి మరీ ఏడిపించడం ఎందుకని "ఫర్వాలేదు, ఇట్స్ ఓకే" అన్నా.

మొత్తానికి పెళ్ళి 'పద్ధతి'గా అయిపోయింది.

పిల్లని వదిలేసి, తెల్ల పెళ్ళివారంతా విమానం ఎక్కారు. ప్రమోద్ పేట్రీషియాని తీసుకుని ఇంకో వారం పోయాక వెళ్తాడట.

ఖర్చు రెట్టింపు అయినా, రెట్టింపు శ్రమ అయినా... ఒక్కగానొక్క కొడుక్కి సంప్రదాయంగా పెళ్ళి చేసినందుకు సంతోషపడింది భవాని.

మేమందరం కూడా శోషవచ్చేలా శ్రమపడినా "పోన్లే పాపం... దాని సరదా తీరింది" అని తృప్తిపడ్డాం. ❑

*విపుల హృదయోల్లాస కథల ప్రత్యేక సంచిక, మే 2012*